క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

ధన్వాడ: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన ప్రారంభించాలని నారాయణపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మయ్యగౌడ్ సూచించారు. పలువురు లబ్ధిదారులు ఆదివారం నిర్మాణం చేపట్టగా ఆయన భూమిపూజ చేశారు. ధన్వాడ మండల కేంద్రంలో మొదటి విడతలో మంజూరైన ఇళ్లకు పంచాయతీ సిబ్బంది మార్కింగ్ వేసి ప్లానింగ్ ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుధాకర్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు రెహమాన్‌ఖాన్, బాలకృష్ణయ్య, రాజు, నరసింహులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కోస్గి రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీబీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఉమ్మడి ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఏబీకే ఫంక్షన్ హాల్లో విలేకరులతో మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా కుల్కచెర్ల మండలంలోని పుట్టపహాడ్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని వారు ఖండించారు. నిందితులు ఎవరైనా సరే కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు బోరు కృష్ణయ్య , నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్‌బాబు, దస్తన్న ,అశోక్ , చిన్నికృష్ణ , గౌరగాళ్ల కృష్ణ పాల్గొన్నారు.

బూడిద వాహనాలతో ఇబ్బందులు



మాగనూర్: మండలంలోని రోడ్లపై బూడిదను తరలిస్తున్న వాహనాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రం శక్తినగర్‌లోని కేటీపీఎస్ నుంచి పదుల సంఖ్యలో టిప్పర్లు నిత్యం మండల కేంద్రం మీదుగా ప్రయాణిస్తున్నాయి. అయితే ఇవి నిబంధనలకు విరుద్ధంగా బూడిద లోడ్‌ను తరలిస్తుండడంతో పాటు కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రజలు దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వెనుక వచ్చే వాహనాదారులు సైతం ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బూడిద తరలిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

బోనాలు కలిసిమెలిసి జరుపుకోవాలి

మరికల్: మండల కేంద్రంలోని గ్రామస్తులందరూ బోనాలు కలిసిమెలిసి జరుపుకోవాలని గ్రామపెద్దలు రామస్వామి, రవి, రాములు, హన్మంతు, తిమ్మన్నలు కోరారు. ఆదివారం పోచమ్మ ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామస్తుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో వరుసగా మూడేళ్ల పాటు రెండు సార్లు బోనాల వేడుకలను జరుపుకున్నట్లు తెలిపారు. ఇప్పటి నుంచి అలా కాకుండా గ్రామస్తులందరూ కలిసి మెలిసి ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని సూచించారు. జూలై 1న పోచమ్మ బోనాలు ఉంటాయని తెలిపారు. ఇందుకు గ్రామస్తులందరూ సహకరించాలని పేర్కొన్నారు.

సూచిక బోర్డులేవి?



మాగనూర్: మండలంలోని మందిపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో మూల మలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. మలుపుల సమీపంలో వ్యవసాయ బావులు ఉండడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం లేకపోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకర మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేరస్తులపై కఠిన చర్యలు

అయిజ: సర్వేయర్ తేజేశ్వర్‌ను దారుణంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి, కేసులో పురోగతి సాధించాలన్నారు. తేజేశ్వర్ హత్య వెనుక ఉన్న కుట్రదారులెవరో తేల్చాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

కేజీబీవీల్లో ఇక కొత్త మెనూ

- పౌష్టికాహారం అందించేందుకు చర్యలు
- నెలలో రెండు సార్లు మటన్‌తో భోజనం



ధన్వాడా కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న జీసీడీఓ నర్మద

కోస్గి: గ్రామీణ ప్రాంతాలకు చెందిన అనేక మంది నిరుపేద విద్యార్థినులకు కస్తూర్బాగాంధీ విద్యాలయాలు ఆసరాగా నిలుస్తున్నాయి. విద్యా వ్యవస్థను బలోపేతం చేసే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో కస్తూర్బాల్లో విద్యను అభ్యసించే బాలికల ఆరోగ్యంపై సర్వే నిర్వహించగా విద్యార్థినులు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నట్లు తేలింది. దీంతో బాలికలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు సీఎం రేవంత్ సర్కారు చర్యలు చేపట్టింది. కేజీబీవీలలో మెస్ ఛార్జీలు పెంచి ఆహార మెనూలో సమూల మార్పులు చేసింది. మార్చిన మెనూను ఈ విద్యా సంవత్సరం నుంచే అమల్లోకి కూడా తెచ్చింది.

అయిదు సార్లు గుడ్డు..

ప్రస్తుతం అమలులోకి వచ్చిన కొత్త మెనూ ప్రకారం వారంలో ఉదయం పూట టమాట కిచిడీ, సాంబారు, రాగిజావ బూస్టు, పూరి ఉప్మా, పులిహోర, బోండా, వడ, చపాతి, జీరారైస్, అరటిపండు అందజేయాలి. మధ్యాహ్నం టమాటా పప్పుతో కూడిన అన్నం, నెయ్యి, రసం, పెరుగు, ఉడకబెట్టిన గుడ్లు, చికెన్ సాయంత్రం ఉడకబెట్టిన శెనగలు, కోడిగుడ్డు బజ్జీ, బెల్లం పల్లీలు, అల్లంచాయ్, మిల్లెట్ బిస్కెట్లు, పకోడి ఇవ్వాలి. రాత్రికి వివిధ రకాల కూరలతో తయారు చేసిన అన్నం, సాంబారు, మజ్జిగ వడ్డించాల్సి ఉంటుంది. దీనికి తోడు నెలలో రెండు సార్లు మటన్ అయిదు సార్లు గుడ్డు అలాగే రోజూ నెయ్యి కూడా అందించనున్నారు.

ఒక్కో విద్యార్థినికి రూ.1,740 ఖర్చు



కోస్గిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల

కస్తూర్బాలలో విద్యను అభ్యసించే విద్యార్థినులకు నూతన ఆహార మెనూ ప్రకారం ఒక్కో విద్యార్థినికి నెలకు రూ.1,740 ఖర్చు చేయనుంది. కేజీబీవీల్లో నూతన మెనూను అమలు చేసేందుకు ఇటీవలె హైదరాబాద్‌లో వంట కార్మికులకు శిక్షణ సైతం ఇచ్చారు. ఈ మెనూ ద్వారా జిల్లాలోనే 11 కేజీబీవీల్లో దాదాపు 3, 658 మంది విద్యార్థినులకు మేలు జరుగనుంది. అయితే అధికారులు తరుచూ పర్యవేక్షణ చేస్తేనే మెనూ అమలు పక్కగా జరిగే అవకాశం ఉందని పలువురు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త మెనూ ప్రకారమే భోజనం

విద్యా సంవత్సరం ప్రారంభం నాటి నుంచే గురుకుల పాఠశాలలో అమలు చేస్తున్న కామన్ మెనూను మన కేజీబీవీలలో కూడా అమలు చేస్తున్నాం. కొత్త మెనూను పకడ్బందీగా అమలు చేయాలని ఇది వరకే ఎస్‌ఓలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశాం. మేము కూడా రోజూ ఒక కేజీబీవీని పరిశీలిస్తున్నాం. అలాగే ప్రతి కేజీబీవీలో కొత్తగా అందించే ఆహార పట్టికను ప్రదర్శనకు ఉంచాలని సూచించాం.

– నర్మద, జీసీడీఓ, నారాయణపేట

బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలి



పర్మన్‌దొడ్డికి వెళ్లే రోడ్డు దుస్థితి

మాగనూర్: మండలంలోని పర్మన్‌దొడ్డి గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరతున్నారు. దశాబ్ద కాలం నుంచి మట్టి రోడ్డే ఉండడంతో వానాకాలంలో బురదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. పర్మన్‌దొడ్డి నుంచి నిత్యం పదుల సంఖ్యలో వివిధ పనుల నిమిత్తం ప్రజలు మాగనూర్ మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తున్నారు. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో కనీసం ఆటోలు కూడా రావడం లేదని, వచ్చిన వారానికి ఒకటి మాత్రమే వస్తాయని వాపోతున్నారు. దీంతో అత్యవసర సమయంలో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామానికి బీటి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



ప్రమాదకరంగా మక్తల్-నారాయణపేట రహదారి

ఊట్కూరు: ఊట్కూరు చెక్‌పోస్ట్ దగ్గర మక్తల్–నారాయణపేట రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ రహదారి గుండా నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. ఇసుక టిప్పర్‌లు, బూడిద టిప్పర్‌లు అతివేగంగా వెళ్తున్నాయని దీంతో చెక్‌పోస్ట్ దగ్గర మలుపులు ఉండడంతో ప్రమాదం జరిగే లేకపోలేదని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేగ నిరోధకాలు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న రేషన్ బియ్యం తరలింపు



పాన్‌గల్ స్టాక్ పాయింట్ గోదాం ముందు బియ్యం లోడ్‌తో వాహనాలు

పాన్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకంలో భాగంగా మండల కేంద్రలోని స్టాక్ పాయింట్ గోదాం నుంచి సన్నబియ్యం గ్రామాల్లోని రేషన్ దుకాణాలకు తరలించే ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వం మూడు నెలలకు సంబంధించిన (జూన్, జూలై, ఆగస్టు) బియ్యం ఒకే సారి పంపిణీ చేస్తుండటంతో వాటి నిల్వలను స్టాక్ పాయింట్‌లో నిల్వ చేసే సామర్థ్యం లేకపోవడంతో వాహనంలో వచ్చిన స్టాక్ మరొక వాహనంలో షిఫ్ట్ చేస్తూ రేషన్ దుకాణాలకు తరలిస్తున్నట్లు స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి ఆంజనేయులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్ గోదాం నుంచి పాన్‌గల్ మండలంతో పాటు చిన్నంబావి, వీపనగండ్ల మండలాల రేషన్ దుకాణాలకు బియ్యాన్ని తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బియ్యం పంపిణీ ఈనెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని, ఇప్పటి వరకు సగానికి పైగా సరఫరా పూర్తి చేశామని, మిగిలిన వాటికి అంతలోపు సరఫరాను పూర్తి చేస్తామన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్ గోదాం ముందు వాహనాల్లో హమాలీలు బియ్యం బస్తాలను నింపుతూ కనిపించారు.

పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలి



విద్యార్థులతో అంగన్‌వాడీ టీచర్ లలిత

మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా మక్తల్ మండలం రామసముద్రంలో ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం నజీయాబేగం ఇంటింటికి వెళ్లి పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే విద్యార్థులకు బట్టలు, భోజనం, పుస్తకాలు, నోటు బుక్స్ అన్ని ఉచితంగా అందజేసి మెరుగైన విద్యను కూడా బోధిస్తామని తెలిపారు. ప్రైవేట్ బడుల్లో చేర్పించి డబ్బును వృథా చేసుకోవద్దని కోరారు. అనంతరం పలువురు విద్యార్థులు ప్రభుత్వ బడిలో చేరగా వారికి ఆహ్వానం పలికారు.కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ లలిత తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి చేతులమీదుగా పురస్కారం



విద్యార్థినికి పురస్కారం అందజేసిన కిషన్ రెడ్డి

ఊట్కూరు: హైదరాబాద్‌లోని ధూల్‌పేట్‌లో ఎస్‌ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఊట్కూరుకు చెందిన చౌదరి గురునాథ్, అనిత కూతురు తేజశ్వినికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రతిభ పురస్కారాన్ని అందజేశారు. విద్యార్థిని ఇంటర్‌లో 1000 మార్కులకు గాను 920 మార్కులు సాధించి ప్రతిభ చాటింది. ఈ విషయమై ఎస్‌ఎస్‌కే సమాజం వారు విద్యార్థినికి ప్రతిభ పురస్కారంతో పాటు నగదును కూడా అందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావురామాజి, ఎస్‌ఎస్‌కే సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు విశ్వనాథ్ రవీందర్, నారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బర్హానే బాదేషా దర్గా ఉత్సవాలు



గంధోత్సవ ఊరేగింపులో మతపెద్దలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం ఎర్రకుంట సమీపంలోని బాదేషా బౌలిలోని హజ్రత్ బర్హానే బాదేషా రహెమతుల్లా అలై దర్గా ఉర్సే షరీఫ్ వేడుకలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన గంధోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక వీరన్నపేటలోని మక్కా మజీద్ నుంచి గంధోత్సవ ఊరేగింపు ప్రారంభమై మదీనా మజీద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ రోడ్, క్లాక్ టవర్, పాన్‌చౌరస్తా మీదుగా దర్గా వరకు నిర్వహించారు. నారే తగ్బీర్ నినాదాలతో దర్గా వరకు గంధోత్సవ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గాలో పూలు, చాదర్లు సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు ఇచ్చారు. రాత్రి ఖవ్వాలి నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నేడు (సోమవారం) చిరాగా (దీపారాధన)తోపాటు ముషాయిరా (కవి సమ్మేళనం) కార్యక్రమం ఉంటుందని ముతవల్లీ డాక్టర్ గయాజ్‌పాషా ఖాద్రీ హకం షర్ఫీ తెలిపారు. 24వ తేదీన ఉదయం 9 గంటలకు ఫాతేహా–ఖత్మే ఖురాన్‌తో దర్గా ఉర్సు వేడుకలు ముగుస్తాయని తెలిపారు. ఉత్సవాల్లో జిల్లా కేంద్రంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కంచికామకోటి పీఠం పాలమూరు శాఖ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడో రోజు ఆదివారం స్వామివారికి ప్రాతఃకాల సమయంలో సుప్రభాతసేవ, మండప దేవతా పూజలు, మూలమంత్ర అనుష్టానములు, హనుమత్ వాహనంపై స్వామివారిని ఊరేగింపు నిర్వహించారు. గోవిందనామంతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యాన్ని చాటింది. బ్రహ్మోత్సవాల్లో శ్రీవెంకటేశ్వర సేవా మండలి అధ్యక్షుడు శ్రీకాంత్‌శర్మ, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రశర్మ, సుదర్శన్‌గౌడ్, అంజనేయులు, భీమాచార్యులు, శ్రీచంద్రశేఖర వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



అయిజ: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని రామకృష్ణ మఠం స్వామీజీ తత్పదానంద మహరాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని సంకాపురం గ్రామంలో రామకృష్ణ ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మహరాజ్ భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలన్నారు. స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్న వయసు నుంచే ఆ ధ్యాత్మిక భావన వైపు నడిపించాలని సూచించారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలి



కిష్టగిరి ప్రజలతో మాట్లాడుతున్న మండల అధ్యక్షులు కె మాణిక్యం

వనపర్తి రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి హామీలు అమలు చేయాలంటే, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను గెలింపించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కె మాణిక్యం పిలుపునిచ్చారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని రాజపేట, కిష్టగిరి, రాజపేట తండా, పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లి, రంగాపురం గ్రామాలలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికి తిరుగుతూ ఆరు గ్యారంటీలు అమలు చేయలేదని, మోసం చేశారని ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించి గుణపాఠం చెప్పాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రఘువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మాధవరెడ్డి, వనం రాములు, దిలీప్ రెడ్డి, కర్రెస్వామి, కృష్ణారెడ్డి, వడ్డె రమేష్, పెద్దింటి వెంకటేష్, ధర్మానాయక్, చిట్యాల రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందని వేతనాలు.. కార్మికుల పస్తులు



చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

- వేతనాలు అందక ఇబ్బందుల్లో మల్టీపర్పస్ వర్కర్లు
- మూడు నెలలుగా చెల్లింపుల్లో జాప్యం
- అర్ధాకలితో విధులకు హాజరు

మాగనూర్: పంచాయతీ కార్మికుల జీవితాలు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఆర్థికభారంతో పంచాయతీలు కూరుకుపోతున్నాయి. చేసిన పనులకు బిల్లులు మంజూరు కాక మాజీ సర్పంచ్‌లు, సంబంధిత కాంట్రాక్టర్లు అప్పుల పాలవుతున్నారు. మరోవైపు కార్మికులు, సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. పంచాయతీ అకౌంట్లో నిధులు ఉన్నట్లు చూపిస్తున్న ట్రెజరీలో ఫ్రీజింగ్ కారణంగా బిల్లులు పాస్‌కాక పంచాయతీల నిర్వహణ ఇబ్బందిగా మారుతోంది. గత మూడు నెలలుగా జీతాలు అందక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబం, పిల్లల చదువులు ఇతర ఖర్చులకు ఈ వేతనాలు వారికి ఎటు సరిపోవడం లేదు. సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు.

మండలంలో ఇలా..

మాగనూర్ మండలంలో 16 గ్రామ పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు, వాటర్‌మెన్, ఎలక్ట్రిషన్స్, ట్రాక్టర్ డ్రైవర్స్, కారోబార్లతో కలిసి మొత్తం 86 మంది మల్టీపర్పస్ సిబ్బంది ఉన్నారు. వీరికి నెలకు రూ. 9500 చొప్పున వేతనాలు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో మండలం మొత్తంగా ప్రతి నెల రూ.8,17,000 లక్షలకు పైగా వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీలకు జనాభా ప్రతిపాదికన ప్రభుత్వాలు ఆర్థికసంఘం నిధులు విడుదల చేస్తున్నాయి. ఒక్కొక్కరికి రూ.166 చెల్లించాల్సి ఉన్నా ప్రస్తుతం రూ.115 కేంద్రం ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా సమానంగా నిధులు విడుదల చేస్తోంది. ఎస్‌ఎఫ్‌సీ నిధులు అదనంగా రావాల్సి ఉంది. వీటితో పాటు పంచాయతీల్లో ఇంటి పన్ను, రిజిస్ట్రేషన్‌లు, భూమి శిస్తు, వాహనాల పన్ను తదితర వాటి ద్వారా కూడా నగదు వస్తోంది. అయితే ప్రస్తుతం నిధులు రాక సిబ్బందికి వేతనాలు ఇవ్వని పరిస్థితి ఏర్పడింది.

వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

తమ జీతాలు పెంచాలని ఇప్పటికే అనేక సార్లు గ్రామ పంచాయతీ సిబ్బంది ఆందోళనలు చేపట్టారు. ప్రస్తుతం ఉన్న జీతంతో కుటుంబ పోషణ భారంగా ఉందని జీవో నెంబర్ 60 ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు రూ.16,500, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22,750 వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, ముఖ్యంగా వారిని అసిస్టెంట్ కార్యదర్శులుగా నియమించాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికుడు/కార్మికురాలు చనిపోతే వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలం ఉన్నవారికి నిర్మాణానికి రూ. 5,50,000 ఇవ్వాలి కోరుతున్నారు.

జీతాలు అందజేస్తాం..



ఎస్‌ఎస్‌డీ ఫండ్, జీపీ ఫండ్ కొరత వలన కొంత మేర ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమే. ప్రభుత్వం కార్మికులకు నేరుగా వారి ఖాతాల్లో పడే విధంగా గ్రీన్‌ఛానల్ ద్వారా నిధులు వేస్తామని తెలిపింది. కాకపోతే వారికి తొందరలోనే జీతాలు అందజేసే విధంగానే చూస్తాం.

– రహ్మతుద్దీన్, ఎంపీడీఓ మాగనూర్

మూడేళ్లుగా కంకర రోడ్డే దిక్కు

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిలిచిన పనులు
- ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా తుపాకితండాకు వెళ్లే రోడ్డు

కొత్తపల్లి: కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతున్నా కొత్తపల్లి మండల పరిధిలోని తుపాకి తండా, వీరారం పెద్దతండాలు మాత్రం అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. ఈ తండాలకు ఇప్పటికీ సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తండాల అభివృద్ధిలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గిరివికాస్ పథకం కింద ఇక్కడ రోడ్డు నిర్మాణం చేపట్టింది. పనులు దక్కించుకున్న ఓ కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణం కూడా చేపట్టాడు. అయితే ప్రభుత్వం మారడంతో నిధుల సమస్య తలెత్తి గుత్తేదారు పనులను మధ్యలోనే ఆపేశాడు. దీంతో తండావాసులు దాదాపు ఏడాదిగా కంకర రోడ్డుపైనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. రోడ్డు నిర్మాణం చేపట్టి కంకర వేసిన తర్వాత పనులను ఆపేయడంతో రాకపోకలకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక రాత్రి సమయాల్లో అయితే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తుందని ద్విచక్రవాహనదారులు వాపోతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోనే సరైన గ్రామీణ రోడ్లు లేకపోవడం ఏంటని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి తమ కష్టాలు తీర్చాలని తండా వాసులు కోరుతున్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి



మా తండాకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో మూడేళ్ల క్రితం బీటీ రోడ్డు పనులు చేపట్టారు. అయితే ఏమైంది ఏమో గానీ గుత్తేదారుడు కంకర వేసి పనులను మధ్యలోనే ఆపేశాడు. ఏడాది నుంచి పనులు ఆగిపోయాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

– చందర్ నాయక్, వీరారం పెద్దతండా

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

నిలిచిపోయిన బీటీ రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభిస్తాం. రోడ్డు పక్కన మరో రోడ్డుకు మట్టి తవ్వకాలు జరుపుతూ భారీ టిప్పర్లు రాకపోకలు సాగించడంతో రోడ్డుపై వేసిన కంకర పక్కకు వెళ్లడంతో పనులు ఆగిపోయాయి. త్వరలోనే పనులు ప్రారంభించి గిరిజనుల కష్టాలు తీరుస్తాం.

– నిత్యానంద స్వామి, ఏఈ, ట్రైబల్ వెల్ఫేర్